# సిండికేట్‌పై ఆరోపణల పర్వం



- అంతర్గత 'రేట్ కార్డ్'తోనే అక్రమ వసూళ్లు?
- కూటమిగా ఏర్పడి సామాన్యులను దోచుకుంటున్నారనే ఆరోపణలు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్24(శ్రీ తొలి క్రాంతి):**

కొత్తగూడెం, పాల్వంచ పరిధిలో మద్యం వ్యాపారులంతా అంతర్గతంగా ఒక బలమైన 'సిండికేట్'గా ఏర్పడ్డారని, ఎక్కడా పోటీ లేకుండా చేసి కృత్రిమ ధరలను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినియోగదారుల నుండి బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించాల్సిన ఎంఆర్‌పీ ధరలను పక్కనబెట్టి సిండికేట్ ప్రతినిధులు ఒక అనధికారిక రేట్ కార్డును రూపొందించుకుని మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.క్వార్టర్ బాటిల్ నిర్ణీత ధర కంటే ₹20 నుండి ₹30 వరకు అదనంగా లాగుతున్నట్లు ఆరోపణ.హాఫ్ బాటిల్ ప్రతి సీసాపైనా ₹40 నుండి ₹60 వరకు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు విమర్శలు.బీర్లు కూలింగ్ ఛార్జీల పేరుతో ప్రతి బాటిల్‌పై నిబంధనలకు విరుద్ధంగా ₹10 నుండి ₹20 వసూలు చేస్తున్నారని కొనుగోలుదారులు మండిపడుతున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేటు ఎందుకు తీసుకుంటున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే, షాపుల్లోని సిబ్బంది "సిండికేట్ రూల్స్ ఇంతే" అంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ఆరోపణలపై విచారణ జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కాంట్రాక్టర్ల 'కాసుల' వేట.. అధికారుల 'మామూళ్ల' బాట?

- ఖమ్మంపాడు చెక్‌డాం పనులపై విపక్షాల మండిపాటు.. విచారణ జరపాలని డిమాండ్!

**అశ్వారావుపేట, జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**

అశ్వారావుపేట మండల పరిధిలోని ఖమ్మంపాడు వాగుపై జరుగుతున్న చెక్‌డాం నిర్మాణ పనులు కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తుంటే అధికారులకు మామూళ్ల పండగలా మారిందనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో స్థానిక ప్రజల్లో జోరుగా వినిపిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడానికంటూ ప్రభుత్వం కేటాయించిన నిధులను కొందరు స్వార్థపరులు కలిసి స్వాహా చేస్తున్నారంటూ విపక్షాలు, గిరిజన సంఘాల నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు కాంట్రాక్టర్లు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పనుల్లో జరుగుతున్న లోపాలపై స్థానిక రైతులు మొత్తుకుంటున్నా.. సంబంధిత శాఖ అధికారులు కళ్లప్పగించి చూడటం వెనుక భారీస్థాయిలో చేతులు మారిన 'మామూళ్లే' కారణమనే అనుమానాలను ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి.

**ఉన్నతాధికారుల తనిఖీలే శరణ్యం!**



నాసిరకం మెటీరియల్‌తో నిర్మిస్తున్న ఈ చెక్‌డాం వల్ల భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదని మొదటి వరదకే ఇది కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నిపుణులు సైతం హెచ్చరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అశ్వారావుపేట అధికారుల నివేదికలపై ఆధారపడకుండా స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి విచారణకు ఆదేశించాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గిరిజన మహిళకు పైసలు..బినామీలకు కోట్లు! ఖమ్మంపాడు మైనింగ్‌లో రికార్డుల మాయాజాలం



**అశ్వారావుపేట, జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**

అశ్వారావుపేట మండలం ఖమ్మంపాడు పరిసరాల్లో సాగుతున్న క్వారీ దందాలో రోజుకో పచ్చి నిజం వెలుగుచూస్తోంది. చట్టాల రక్షణ కోసం ఓ అమాయక గిరిజన మహిళ పేరు మీద లీజు రికార్డులు సృష్టించిన బినామీలు.. ఆమెకు నెలకు కొన్ని వేల రూపాయలు విదిల్చి తాము మాత్రం రోజుకు లక్షల్లో వెనకేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. పేరు ఆమెది.. పెత్తనం, కోట్లాది రూపాయల లాభాలు మాత్రం మైనింగ్ మాఫియావి అన్న చందంగా ఇక్కడ వ్యవహారం నడుస్తోంది. లీజు పొందిన గిరిజన మహిళకు అసలు అక్కడ ఎంత వ్యాపారం జరుగుతుందో, రోజుకు ఎన్ని లారీల ఖనిజం తరలిపోతుందో కనీస అవగాహన కూడా లేకపోవడం గమనార్హం.

**రికార్డుల్లో తక్కువ.. రవాణాలో ఎక్కువ!**

అనుమతి పొందిన పరిమితి కంటే పది రెట్లు అదనంగా మైనింగ్ తవ్వకాలు జరుపుతూ వే బిల్లులు లేకుండానే టన్నుల కొద్దీ ఖనిజాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రికార్డులను తారుమారు చేస్తూ మైనింగ్ మాఫియా ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన రాయల్టీని భారీగా ఎగ్గొడుతోందని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి కోట్లల్లో గండి పడుతోందని సమాచారం.

**కళ్ళు మూసుకున్న విజిలెన్స్?**

ఇంత పెద్ద ఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా మైనింగ్ విజిలెన్స్ అధికారులు కానీ, స్థానిక టాస్క్‌ఫోర్స్ కానీ అటువైపు రాకపోవడం వెనుక పెద్ద పెద్ద రాజకీయ హస్తాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రికార్డులను క్షేత్రస్థాయి పరిశీలన చేసి, బెనామీల అసలు భాగోతాన్ని బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆత్మహత్యకు ప్రేరేపించిన ఐదుగురికి జైలు శిక్ష

**అశ్వారావుపేట,జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**

అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం నెహ్రూనగర్‌కు చెందిన తగరం ముత్యాలరావు ఆత్మహత్య కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. మృతుడు తగరం ముత్యాలరావు స్థానిక కెమిలాయిడ్స్ కర్మాగారంలో పనిచేసేవారు అతని భార్య శ్యామల అదే గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వర్లుతో వివాహేతర సంబంధం కొనసాగించిందని ప్రియుడితో కలిసి భర్తను మానసికంగా వేధించిందని విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన ముత్యాలరావు 2018 జూలై 31న కెమిలాయిడ్స్ కర్మాగారం వెనుక ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.ఆత్మహత్యకు తన భార్య శ్యామలతో పాటు ఆమె ప్రియుడు తగరం వెంకటేశ్వర్లు కారణమని ముత్యాలరావు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. దీంతో అప్పటి ఎస్ఐ వేల్పుల వెంకటేశ్వరరావు 14 మంది నిందితులపై క్రైం నంబర్ 178/2018 కింద ఐపీసీ సెక్షన్ 306, 34 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసులో వాదోపవాదాలు పూర్తయ్యిన అనంతరం ప్రధాన నిందితురాలు శ్యామలకు ఏడు సంవత్సరాల సాధారణ కారాగార శిక్ష, తగరం వెంకటేశ్వర్లుకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. అలాగే తగరం పుల్లారావుకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రామారావు, నరసింహులకు మూడేళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కవిత తీర్పు వెలువరించారు. నిందితులందరికీ రూ.10 వేల చొప్పున జరిమానా కూడా విధించారు.నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ బి. నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె. రాజారావు, పి.వి.డి. లక్ష్మిలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

## బోర్డులు మారాయి..'దొంతికుంట' రాత మారలేదు!

**అశ్వారావుపేట జూన్ 24(శ్రీ తొలి క్రాంతి):**



ప్రభుత్వాలు మారాయి నిధుల బోర్డులు మారాయి... కానీ అశ్వారావుపేట దొంతికుంట చెరువు తలరాత మాత్రం మారడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరువు సుందరీకరణ కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గుమ్మరిస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం పనులు 'మూడు మట్టి దిబ్బలు... ఆరు కబ్జాలు' అన్నట్లుగా సాగుతుండటంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారుచెరువు చుట్టూ ఉన్న సహజసిద్ధమైన కాలువలను, సరిహద్దులను ఆక్రమణదారులు మట్టిపెట్టి పూడ్చేస్తుంటే... అధికారులు సైతం అదే చెరువులో మట్టి తోలుతూ అభివృద్ధి పనుల పేరిట హడావుడి చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు ఈ మట్టి పనులు కబ్జాలను కప్పిపుచ్చడానికేనా అన్న అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**సర్వే రిపోర్ట్... 'టాప్ సీక్రెట్'!**

దొంతికుంట చెరువు అసలు విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం మిగిలింది ఎంత? అనే నిజాలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎందుకు గుప్తంగా ఉంచుతున్నారు? సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బహిరంగపరచడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టి, ఆక్రమణల కోరల నుండి చెరువును విడిపించాలని అశ్వారావుపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఓటర్ల సర్వేకు సహకరించండి

**అశ్వారావుపేట, జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**

అశ్వారావుపేట మండలంలోని గాండ్లగూడెం గ్రామపంచాయతీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలోతు ఆలీ బాబు మాట్లాడుతూ, బీఎల్ఓలు అడిగే అవసరమైన ఆధార పత్రాలను అందజేసి సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటర్ల నమోదు, వివరాల ధృవీకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపసర్పంచ్ హెచ్ శ్రీను, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**సత్తుపల్లి, జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**



రోడ్లు-భవనాల శాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగి సూ రవరపు వెంకట్రావు, వెంకట పుష్పవతి దంపతులు బుధవారం సత్తుపల్లి లో తమ 56వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇద్దరు పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను అందజేశారు.సమాజ సేవలో భాగంగా స్వరవరపు వెంకట్రావు గత కొంతకాలంగా తన తండ్రి జ్ఞాపకార్థం అనాథలు, పేద విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవసరమైన వస్తువులు, విద్యా సామగ్రిని అందజేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ సందర్భంగా యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెంకట్రావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, తదితరులు వెంకట్రావు దంపతులను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రుద్రాక్షపల్లిలో అంగన్వాడీ గుడ్లు ప్రక్కదారి?

- సత్తుపల్లి మండలంలో కలకలం.. గుడ్లతో వెళ్తున్న వ్యక్తిని పట్టుకున్న పంచాయతీ కార్యదర్శి

**సత్తుపల్లి, జూన్ 24 (శ్రీ తొలి క్రాంతి):**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి సరఫరా చేసిన గుడ్లు ప్రక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. గ్రామంలోని ఓ అంగన్వాడీ కేంద్రం నుంచి గుడ్లను కొనుగోలు చేసి మోటార్‌సైకిల్‌పై తరలిస్తున్న వ్యక్తిని గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ పట్టుకున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.స్థానికుల కథనం ప్రకారం, నాగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అంగన్వాడీ కేంద్రం నుంచి గుడ్లను తీసుకెళ్తుండగా అనుమానం వచ్చిన పంచాయతీ కార్యదర్శి అతడిని ఆపి విచారించారు. అనంతరం గుడ్లను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించగా, సీడీపీవో స్పందించలేదని తెలిసింది. అంగన్వాడీ కేంద్రానికి చెందిన గుడ్లు ఎలా విక్రయించబడ్డాయి? ఇందులో ఎవరి పాత్ర ఉంది? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బీఎల్‌ఏలు విధిగా పాల్గొనాలి

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ

**అశ్వారావుపేట, జూన్ 24(శ్రీ తొలి క్రాంతి):**



నేడు నిర్వహించనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అందరూ విధిగా పాల్గొనాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల మార్పులు, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి అంశాల్లో ప్రజలకు సహకరించాలని బీఎల్‌ఏలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌ఏలు పాల్గొననున్నట్లు తెలిపారు.

శ్రీ తొలిక్రాంతి
RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
SRITHOLIKRANTHI

# చరణ్‌ను మోదీ అలా పిలవడం సంతోషంగా ఉంది




రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈనెల 4న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ ఏకంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించింది. తాజాగా ఈ మూవీ సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా తనయుడు రామ్ చరణ్ నటనపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చరణ్ నటించలేదని.. జీవించాడని కొనయాడారు. అంతేకాదు అవార్డుల కంటే చరణ్ నటనపై ప్రశంసలే నాకు ఎక్కువ అని అన్నారు. ఈ సినిమాలో జాతీయ అవార్డ్ ఫర్మామెన్స్ ఇచ్చాడంటూ ఆకాశానికెత్తేశారు. తాజాగా ప్రధాని మోదీ చరణ్‌పై ప్రశంసించడంపై మెగాస్టార్ ట్వీట్ చేశారు. చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంభోధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమన్నారు. రామ్ చరణ్ ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటూ పోస్ట్ చేశారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!" అంటూ సంతోషం వ్యక్తం చేశారు. కాగా.. రిపబ్లిక్ టీవీ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు.



## నలుగురు డైరెక్టర్స్ మారారు..
# ఎట్టకేలకు ఫస్ట్ లుక్

గతేడాది 'కూలీ'గా వచ్చిన రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2' చేస్తున్నారు. కమల్ హాసన్‌తో కలిసి ఓ మల్టీ స్టారర్ చేయాల్సి ఉంది. మరోవైపు కమల్ నిర్మాణంలో ఓ మూవీలోనూ నటిస్తున్నారు. తాజాగా ఆ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. టైటిల్ కూడా రివీల్ చేశారు. ఇందులో డెడ్లీ డాక్టర్‌గా రజనీ కనిపించబోతున్నారు. తమిళంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్'.. తెలుగులో 'ఓరి దేవుడా' సినిమాలు తీసిన అశ్వత్ మారిముత్తు.. రజనీకాంత్ 173వ మూవీ 'ధర్మన్' తెరకెక్కిస్తున్నాడు. ఇదో థ్రిల్లర్ జానర్ స్టోరీ. రేపటి (జూన్ 25) నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు అశ్వత్ వెల్లడించారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది. బహుశా దీన్ని వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయొచ్చు. ఇకపోతే ఈ మూవీ దర్శకుల మార్పు గురించి మాట్లాడిన రజనీకాంత్.. తొలుత కేఎస్ రవికుమార్ అనుకున్నాం. తర్వాత సుందర్.సి వచ్చాడు. కానీ అతడికి ఉన్న వేరే కమిట్మెంట్ వల్ల తప్పుకొన్నాడు. అనంతరం శిబి చక్రవర్తి ప్రాజెక్టులోకి వచ్చి వెళ్లాడు. ఇది చాలా సెన్సిటివ్ సబ్జెక్ట్. ఇందులో నేను న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేసే సైంటిస్ట్‌గా కనిపిస్తాను. ఆఫ్గనిస్థాన్, రష్యాలో షూటింగ్ ప్లాన్ చేశాం. ఇది తీయడానికి చాలా సమయం పడుతుంది. అందుకే చివరకు అశ్వత్ మారిముత్తు ఈ ప్రాజెక్టులోకి వచ్చాడు అని చెప్పారు.



## వెయింటిగ్ ఈజ్ ఓవర్..
# సర్దార్-2 వచ్చేస్తున్నాడు..!

కోలీవుడ్ హీరో కార్తీ నటించిన సీక్వెల్ మూవీ సర్దార్ 2. గతంలో వచ్చిన సర్దార్‌కు కొనసాగింపుంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ మూవీ షూటింగ్ గతేడాది జూన్‌లోనే పూర్తయి ఏడాది కావోస్తోన్న ఇప్పటికీ రిలీజ్‌కు నోచుకోలేదు. ఈ సినిమా రిలీజ్ డేట్ కోసం కార్తీ ఫ్యాన్స్ ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడింది. ఈ మూవీ విడుదల తేదని మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 10న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. దీంతో కార్తీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇప్పటికైనా రిలీజ్ డేట్ ఫిక్స్ కావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్ట్ 1 సూపర్ హిట్ కావడంతో సర్దార్ 2పై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ కార్తీకి జంటగా మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య విలన్ పాత్రలో మెప్పించనున్నారు.



## కుర్రాళ్ళ లేటెస్ట్ క్రష్
# అందాల భామ రమ్య పసుపులేటి

రమ్య పసుపులేటి.. ఇప్పుడిప్పుడే టాలీవుడ్ లో నటిగా గుర్తింపు పొందుతుంది ఈ ముద్దుగుమ్మ . తన అందంతో అభినయంతో కట్టిపడేస్తుంది ఈ చిన్నది. ఆమె 2018లో విడుదలైన 'హుషారు' సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఈ సినిమాలో తన క్యూట్ యాక్టింగ్ తో కవ్వించింది. ఆతర్వాత వరుసగా సినిమాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ అమ్మడు నటించిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆడలేదు. మైల్స్ ఆఫ్ లవ్, ఫస్ట్ ర్యాంక్ రాజు', బీఎఫ్ఎఫ్ ('బెస్ట్ ఫ్లాట్‌మేట్ ఫరెవర్) అనే వెబ్‌సిరీస్‌లో నటించి మంచి గుర్తింపునందుకుంది. 2024లో వచ్చిన మారుతి నగర్ సుబ్రమణ్యం సినిమాతో ఈ అమ్మడు మంచి హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. మ్యాన్ స్కేర్ సినిమాలో చిన్న పాత్రలో అలా మెరిసి ఇలా మాయం అయ్యింది. సోలో బాయ్ అంజి సినిమా చేసింది. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర సినిమాలో నటిస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది క్రేజీ ఫోటోలు షేర్ చేస్తుంది.



## కంటెంట్‌తో కొట్టిన సామ్..
# డబుల్ బొనాంజా

సమంత ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్. కానీ పరిస్థితుల కారణంగా కొన్నాళ్ల పాటు సినిమాలకు దూరమైపోయింది. మరీ ముఖ్యంగా విడాకుల తర్వాత ఈమెపై విపరీతమైన నెగిటివిటీ వచ్చింది. ఈమెనే దీనికి కారణమన్నట్లు చాలామంది నెటిజన్లు విమర్శలు కూడా చేశారు. అలా టాలీవుడ్‌లోనే చాలానే విమర్శలు సమంత.. ఇప్పుడు అదిరిపోయే కమ్ బ్యాక్ ఇచ్చింది. ఇంతకీ ఇదెలా సాధ్యమైంది? సామ్‌కి ఎక్కడ కలిసొచ్చింది? చెన్నైకి చెందిన సమంత.. 'ఏ మాయ చేశావె'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంలో చేసి జెస్సీ పాత్రకు మంచి పేరు రావడంతో సామ్ పేరు హైలైట్ అయిపోయింది. ఈ దెబ్బకు ఎన్టీఆర్, మహేశ్ బాబు లాంటి స్టార్ హీరోల చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. అవి హిట్ కావడంతో ఈమె స్టార్ హీరోయిన్ అయిపోయింది. టాలీవుడ్‌కి చెందిన నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ నాలుగేళ్లకే విడిపోవడంతో సమంతపైనే ఎక్కువగా విమర్శలు వచ్చాయి. విడాకుల తర్వాత సమంత సినిమాలు చేయడం కూడా తగ్గించేసింది. 2022లో వచ్చిన 'శాకుంతలం' అయితే సమంత కెరీర్‌లోనే పెద్ద డిజాస్టర్ అయింది. తీసింది దర్శకుడు గుణశేఖర్ అయినప్పటికీ ప్రమోషన్ల టైంలో తన వ్యాధి గురించి చెప్పడం, కన్నీళ్లు పెట్టుకోవడం లాంటి వీడియోల కారణంగా సమంతనే ఎక్కువ టార్గెట్ అయింది. తర్వాత ఏడాది చేసిన 'ఖుషి' మూవీ పర్లేదనిపించినప్పటికీ పెద్ద సక్సెస్ కాలేదు.



## ఆచితూచి అడుగులేస్తున్న మృణాల్..
# నెక్స్ట్ సినిమా ఎవరితో..?

బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. మరాఠీ బుల్లితెరపైకి నటిగా ఎంట్రీ ఇచ్చిన ఆమె.. ఆ తర్వాత నెమ్మదిగా కథానాయికగా మారింది. హిందీలో హీరోయిన్ ఆఫర్స్ అందుకుంటూ అద్భుతమైన నటనతో మెప్పించింది. మృణాల్ కు ఎక్కువగా క్రేజ్ వచ్చింది మాత్రం తెలుగు సినిమాతోనే.డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కించిన సీతారామం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ.మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఇందులో సీతా మహాలక్ష్మి పాత్రలో అందం, అభినయంతో కట్టిపడేసింది.దీంతో తెలుగులో వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి సినిమాలతో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంది.తెలుగుతోపాటు అటు హిందీలోనూ మరిన్ని ఆఫర్స్ అందుకుంది. అయితే ఫ్యామిలీ మ్యాన్ సినిమా తర్వాత మృణాల్ స్పీడ్ తగ్గించింది.ఇటీవలే డెకాయిట్ తో హిట్ కొత్తగా మృణాల్.. మళ్లీ చిన్న గ్యాప్ ఇచ్చింది. ఈ అమ్మడి నెక్స్ట్ సినిమా కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.

# అబ్బబ్బా.. క్యూట్ స్మైల్ తో చంపేస్తోన్న మహా..



బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి జ్యోతి పూర్వాజ్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. 'పొదరిల్లు' , 'మగువ ఓ మగువ' వంటి పాపులర్ ధారావాహికల ద్వారా తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్.బుల్లితెరపై ఎంతో హోమ్‌లీగా, పద్ధతిగా కనిపించే ఈ నటి.. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.సాధారణంగా సీరియల్స్‌లో సాంప్రదాయబద్ధమైన పాత్రల్లో కనిపించే నటీమణులు.. రియల్ లైఫ్‌లో మోడరన్ అవుట్‌ఫిట్స్‌లో కనిపిస్తే ఆడియన్స్ ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు.కృతిక విషయంలోనూ అదే జరిగింది. ఆమె తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో ట్రెండీ , స్టైలిష్ గ్రీన్ కలర్ లాంగ్ ఫ్రాక్ డిజైన్ దుస్తులలో మెరిసిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటోస్ వైరలవుతున్నాయి.స్లీవ్‌లెస్ టాప్, దానికి మ్యాచింగ్ చున్నీతో ఉన్న ఈ ఇండోవెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో ఆమె ఎంతో అందంగా, క్యూట్‌గా కనిపిస్తూ కుర్రకారు మనసు దోచుకుంటోందని కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఈ ఫోటోలలో కృతిక ఇచ్చిన క్యూట్ స్మైల్, స్టన్నింగ్ పోజులు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఫోటోలు చూసిన ఆమె అభిమానులు తెగ మురిసిపోతున్నారు.బుల్లితెర మహాలక్ష్మి.. మోడరన్ లుక్‌లోనూ అదిరిపోయింది, చాలా క్యూట్‌గా ఉన్నావు మహా అంటూ లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మహాలక్ష్మి లేటేస్ట్ లుక్స్ వైరలవుతున్నాయి.



Printed, Published and Owned by **MALOTHU RAMARAO,** Printed at M/s.KAKATIYA PRINTERS, 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR COLONY, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039. **Editor: MALOTHU RAMARAO CHANDRAKALA.**
H.NO: 3-59,GANDLAGUDEM VILLAGE,ANANTHARAM POST , ASWARAOPETA MANDAL, BHADRADRI KOTHAGUDEM , KHAMMAM, TELANGANA - 507301.Telangana **RNI No :TGTEL/26/A2143** Contact: 83281 23579,email id:venkatnaik66666 @gmail.com